క్లుప్తంగా

ఉపాధ్యాయులు ధర్నాను జయప్రదం చేయాలి



దుగ్గిరాల: రాష్ట్ర స్థాయి ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ దుగ్గిరాల ప్రధాన కార్యదర్శి చెట్టిపోగు లక్ష్మణ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన ఈమని గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో 1–5 తరగతులను, ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. విద్యార్థులతో సంబంధం లేకుండా కనీసం రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీ కమిటీ వెయ్యాలని కోరారు. 30 శాతం ఐఆర్‌ను మంజూరు చెయ్యాలన్నారు. ఇవే డిమాండ్లతో జరగనున్న రాష్ట్ర స్థాయి ధర్నాను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు.

కోర్టుల తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ ఇక్కడి కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.నవనీతం, ఇమాంబి, గురవయ్య, దానయ్య, హగ్గయ్య, దుర్గాభవాని, సూర్యప్రకాశరావు, శారద, ఎం.సుబ్బారావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో మేలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవిశిక్షణలో భాగంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన పలు పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు చదివే విధానం, ఎటువంటి అంశాలుతో కూడినవి చదవాలి వంటి వాటిపై ఉపాధ్యాయుడు రాజు తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. పుస్తకాలు చదవడం వల్ల మేలు జరుగుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి విగ్రహం తొలగింపు



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి విగ్రహానికి మంగళవారం వేదపండితులు కళాపకర్షణ కార్యక్రమం నిర్వహించినట్లు దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖల అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో విగ్రహానికి విశేషపూజలు, కళాపకర్షణ కార్యక్రమాలను వేదపండితులు భరద్వాజ్ నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి శ్రీనివాస్, ఎస్ఐ పి.జాన్ ఖాన్, వీఆర్వో బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మురుగు కాలువలలో పూడిక తీత



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రత్నాల చెరువు మురుగు కాలువలలో పూడిక తీత పనులు మంగళవారం ప్రారంభించారు. మురుగు కాలువలలో చెత్త పేరుకుపోయి ప్రవాహం సజావుగా సాగని ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో చెత్త పేరుకుపోవడంతో ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా మురుగు నీరు నిలిస్తే వెంటనే సంబంధిత సచివాలయంలోని పారిశుద్ధ్య సిబ్బందికి తెలియజేయాలని ప్రజలను కోరారు.

రుణాలకు రాజకీయ గ్రహణం

కూటమి తీరుతో తప్పని కష్టాలు
- ఇంటర్వ్యూలు పూర్తయినా అందని రుణాలు
- పచ్చ నాయకులు చెప్పిన వారికే ప్రయోజనం
- రాయితీలో సగం ఇవ్వాలని లబ్ధిదారులతో ఒప్పందాలు
- ఆందోళనలో దరఖాస్తుదారులు



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ప్రభుత్వం మంజూరు చేసే రాయితీ రుణాలతో చిన్న వ్యాపారాలు పెట్టుకుని జీవనం సాగించవచ్చని దరఖాస్తు చేసిన వారికి ఇంటర్వ్యూలు ముగిసి నెల గడుస్తున్నా మంజూరు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏది ప్రకటించినా.. ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణలో మాత్రం శూన్యమని ఈ వ్యవహారం కూడా నిరూపిస్తోంది. సూపర్ సిక్స్‌ను అటకెక్కించిన ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వయం ఉపాధి రాయితీ రుణాల విషయంలోనూ అదే తరహాలో వ్యవహరిస్తోంది. అధికార పార్టీ స్థానిక నాయకుల సిఫార్సు ఆధారంగా రుణాలు మంజూరు అవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మంగళగిరి : వెనుకబడిన తరగతుల వారితోపాటు అన్ని కేటగిరీల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం ఈ రాయితీ రుణాలు మంజూరు చేయిస్తున్నట్లు ప్రకటించింది. దీని కోసం ఒక్కో మండలం నుంచి 60 నుంచి 90 యూనిట్ల వరకు అనుమతులు ఇచ్చింది. ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షలు మంజూరు చేయనున్నట్లు పేర్కొంది. బీసీలతోపాటు ఓసీలకు సైతం రూ.75 వేలు రాయితీ ఇవ్వనుంది. రూ.1.25 లక్షల రుణంగా మంజూరు చేయనుంది. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష సబ్సిడీ దక్కనుంది.

అడ్డుకుంటున్న పచ్చ నేతలు

అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయా మండల, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీంతో రాయితీ రుణాలపై ఎంతో ఆశతో ఒక్కో లబ్ధిదారుడు రూ.400 ఖర్చు చేసి దరఖాస్తు చేసుకున్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో బీసీ కేటగిరీ నుంచి 2450 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి 1,020 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు ఏప్రిల్ 3, 5వ తేదీలలో పూర్తి అయ్యాయి. ఎస్సీలను ఇంకా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంకా ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఇంటర్వ్యూలు ముగిసిన వారు బ్యాంకుల వద్దకు వెళ్లగా స్థానిక పచ్చ నాయకులు అడ్డుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఆయా బ్యాంక్ మేనేజర్లను కలిసి తాము చెప్పిన వారికే రుణాలు మంజూరు చేయాలని చెప్పినట్లు దరఖాస్తులు ఆరోపించారు. రాయితీలో సగం తమకు కమీషన్ కింద ముందే చెల్లిస్తే వెంటనే రుణం మంజూరు చేయిస్తామని చోటా నాయకులు చెబుతున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో పని లేకుండా అధికారులు వెంటనే రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

సిబిల్ స్కోర్ ఆధారంగానే మంజూరు



మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వయం ఉపాధి పొందాలనుకునే యువతకు బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. దరఖాస్తులు బ్యాంకులకు పంపించారు. ఎస్సీ అభ్యర్థుల నుంచి ఇంకా దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే బ్యాంకులకు పంపిస్తాం. ఎస్టీలకు ఆన్‌లైన్ ప్రారంభమయిన తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తాం. దరఖాస్తులను సంబంధిత బ్యాంకు మేనేజర్లు పరిశీలించి సిబిల్ స్కోర్ ఆధారంగా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేస్తాం.

– అలీంబాషా, కమిషనర్, ఎంటీఎంసీ

సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు


ఫిరంగిపురం: ఈ నెల 20న కార్మిక సంఘాలు పిలుపులో భాగంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను వేగవంతం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిరుద్యోగం పెరిగిందని, కార్మికులకు భద్రత లేదన్నారు. పంచాయతీలో శాశ్వత ఉద్యోగాలు కాకుండా టెండర్ విధానం ద్వారా ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. ఇవి కార్మికుల హక్కులను కాలరాసేలా ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఉన్న కార్మికులు లేబర్ కోడ్‌ను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, శ్రావణ్, హనోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ముర్తుజానగర్ షాదీఖానాలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

దుగ్గిరాల: మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. దుగ్గిరాల ముర్తుజానగర్ షాదీఖానాలో జరిగిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు రూపొందించిందని చెప్పారు. సమ్మెకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, జి. శ్రీనివాసరావు, ఎం.నాగమల్లేశ్వర రావు, బి.చిరంజీవి, వై. బ్రహ్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు సేవ చేసిన వారికి సౌభాగ్యం



మాట్లాడుతున్న కేవీ కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జగత్‌గురువు శ్రీశంకరాచార్యులు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై రెండు రోజులు జరిగే ప్రవచనాలు మంగళవారం మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు, శ్రీసుందరచైతన్యానందస్వామి శిష్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ భగవంతుడి ప్రతి రూపమే తల్లి అన్నారు. ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రులకు సేవలు చేసిన వారికి సౌభాగ్యం , నిరంతరానందం కలుగుతుందని పేర్కొన్నారు. త్యాగం, ప్రేమ, సేవ, చింతనకు మారుపేరు తల్లి అని అన్నారు. తల్లికి మించిన దైవం లేదన్నారు. సృష్టికి మూలం అమ్మ అని, సృష్టించలేనిది తల్లి గుణం పేర్కొన్నారు. కళ్లకు కనిపించే పర దేవతే తల్లి అని జగత్ గురు శంకరాచార్యులు మాతృపంచకంలో వివరించారని గుర్తుచేశారు. భగవంతుని అమ్మ స్వరూపంతో, మాతృభక్తితో కొలిచినప్పుడు భూలోక సౌఖ్యాలు పొందవచ్చునని అన్నారు. తల్లిదండ్రులను హింసిస్తే కలిగే పాపం నూరేళ్ల సేవ చేసినా తీరదన్నారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, చిన్నకేశవరావు, తూనుగుంట్ల సుందరరామయ్య పాల్గొన్నారు.

దేవ్ భట్టాచార్య మృతి తీరనిలోటు



దేవ్ భట్టాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నన్నపనేని శివాజీ, నేతలు

లక్ష్మీపురం: ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యులు దేవ్ భట్టాచార్య మరణం రవాణా రంగ కార్మికులకు తీవ్ర తీరని లోటు అని ఏఆర్‌టీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం దేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా రంగా కార్మికులందరినీ ఒక తాటిపై తీసుకురావడం కోసం తన జీవితం మొత్తం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి దేవ్ అన్నారు. దేశంలో రవాణా రంగంలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకురావడం రవాణా రంగ కార్మికులను వారి హక్కుల కోసం నిరంతరం వారి సమస్యలపై పార్లమెంట్లో ప్రస్తావించటం ఇతర సందర్భాలలో బహిరంగ వేదికలలో వారి గొంతుకుగా భట్టాచార్య నిలిచారన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కే గంగాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు కురాకుల రాంప్రసాద్, సీఐటీయూ నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్‌వలి, జి.శంకర్ పాల్గొన్నారు. తొలుత భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఆలయాన్ని సందర్శించిన ఈఓ

పట్నంబజారు: నగరంలోని లాలాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల కార్యనిర్వహణ అధికారి శుభద్ర ఆలయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు. నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మంగళవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఉదయం ఆలయానికి చేరుకుని ప్రసాదం విక్రయం, సిబ్బంది తీరు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది వ్యవహార శైలి సక్రమంగా ఉండాలని సూచించారు. ఉదయం 6 గంటలకు లడ్డూ ప్రసాదం కౌంటర్ తెరిచి ఉంచాలన్నారు. అధిక ధరలకు ఎలాంటి విక్రయం జరుపరాదని ఆదేశించారు. భక్తులు పూజా కార్యక్రమానికి రశీదు పొందాలని కోరారు.

ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని చుట్టుగుంట కేకేఆర్ సినిమా హాల్ వెనకాల అనధికార కట్టడాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని నగరానికి చెందిన గుమ్మడి భారతీ నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని మంగళవారం ఆమె పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మంగళగిరి: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళగిరి పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీహెచ్ వెంకటేశ్వరరావు, జే సంజీవరావుల ఆధ్వర్యంలో 46 మంది అధికారులు, 189 మంది మొత్తం 46 బృందాలుగా ఏర్పడ్డారు. 3,121 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ 0.53 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతరాల్లో విద్యుత్ వాడుకుంటున్న 9 మందికి రూ 1.20 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుకుంటున్న 124 మందికి రూ 10.37 లక్షలు కలిపి మొత్తం రూ.12.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. తొలిసారి విద్యుత్ చౌర్యం చేస్తే కాంపౌండింగ్ పద్ధతిలో జరిమానా విధించడం జరుగుతుందని, రెండో సారి పాల్పడితే అరెస్ట్ చేయిస్తామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కె.రవికుమార్, జి.సురేష్‌బాబు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి



లక్ష్మీపురం: ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ సైనికుల శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిసినట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం వీర జవాన్లకు నివాళి కార్యక్రమం నిర్వహించారు. తొలుత వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటంవద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టి గుణపాఠం చెప్పామన్న ప్రధాని మోదీ మాటలు అక్షర సత్యమన్నారు. రాజ్యాంగ చర్చ వేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ పాక్‌లో తల దాచుకుంటున్న ఉగ్రవాదులపై ఉగ్రవాద స్థావరాల పై దాడిగానే సిందూర్ కొనసాగిందని, లక్ష్యాలను గురి చూసి కొట్టడంలో మన దేశ సైనికులు అసమానమైన ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు.

దళితులకు జిల్లా ఉన్నతాధికారులు అండగా నిలవాలి

నగరంపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక గ్రామాల్లో దళితుల పరిస్థితి దారుణంగా ఉందని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పళ్లపాడు గ్రామంలో జరిగిన దళితవాడ సాంఘిక బహిష్కరణను తీవ్రంగా ఖండించారు. అధికారం అండదండలతో పెత్తందారులు గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తూ, దళితులపై ఆధిపత్య పోరు కోసం దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అదేమని అడిగితే తమకు ఎదురు మాట్లాడుతున్నారని ధూషిస్తూ గ్రామాల్లో సాంఘిక బహిష్కరణ చేస్తున్నారని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆ గ్రామాన్ని సందర్శించి, దళితుల సమస్యలను పరిష్కరించి అండగా నిలవాలని అన్నారు.

బియ్యం బ్యాగ్ తూకం కచ్చితంగా ఉండాలి



నెహ్రూ నగర్: బియ్యం బ్యాగ్ తూకం విషయంలో కచ్చితత్వం పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎస్.ఎస్ మాధురి సూచించారు. నగరంలోని గుంటూరు మోడ్రన్ రైస్ మిల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్డ్ కమోడిటీస్ రూల్స్ ప్రకారం ప్రతి రైస్ బ్యాగ్ పై డిక్లరేషన్(తయారీ తేదీ, కంపెనీ వివరాలు) తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఎవరైతే రైస్ ప్యాక్ చేస్తున్నారో వారు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా ప్యాకర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కాటాలో తేడాల్లేకుండా చూసుకోవాలని తప్పనిసరిగా డిపార్ట్మెంటు నుంచి స్టాంపింగ్ వేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

మానసిక సమస్యలకు టోల్‌ఫ్రీ నంబరు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావణి

మంగళగిరి టౌన్: మంగళగిరి ఎయిమ్స్ సైక్రియాట్రీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో టెలి-మానస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టెలి-మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నా నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ట్రైన్డ్ కౌన్సిలర్లు తగిన సహాయం చేస్తారని తెలిపారు. సమస్య పెద్దగా ఉన్న పక్షంలో దగ్గరలోని సైక్రియాట్రిస్ట్‌కు రిఫర్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వీస్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమ పరిధిలోని ప్రజలకు టెలి-మానస్‌పై అవగాహన కల్పించాలని కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లోని సైక్రియాట్రీ విభాగంలో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూష మాట్లాడుతూ కొన్ని సమస్యలు కౌన్సెలింగ్ ద్వారా తీరతాయని తెలిపారు. మందుల ద్వారా కూడా వైద్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. మందులతో నయం కాని వారికి వేరే పరికరాలతో ట్రీట్‌మెంట్ ఇస్తామని పేర్కొన్నారు. యోగ, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా కొంతవరకు మానసిక సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.అనూష, కోఆర్డినేటర్ అంజయ్య, డీఈవో అశోక్, డాక్టర్ జగదీష్, వైద్యులు చిన్మయి, ఆదిత్య, ప్రీతమ్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రూ.పది వేలు పెన్షన్ ఇవ్వాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో 60 సంవత్సరాలు నిండిన పేదలకు రూ.వేలు పెన్షన్‌గా అందజేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని అన్నారు. విద్యుత్ చట్ట సంస్కరణలను ఎత్తివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగు సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేలా కేంద్రం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, రైతు సంఘం మంగళగిరి మండల నాయకులు ఎం.పకీరయ్య, గ్రామ నాయకులు బొప్పన గోపాలరావు, డోకిపర్తి రాజేంద్రబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పరిమిశెట్టి శివనాగేశ్వర రావు, కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల పనితీరుపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఏపీఎం సాంబశివరావు

తాడికొండ: బ్యాంకు నిబంధనలు, పథకాలపై అవగాహన తప్పనిసరి అని సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సంస్థ రీసోర్స్ పర్సన్‌లు ఎస్.శ్రీనివాసరావు, ఆర్ఎస్ శంకరరావు అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాతాదారుల అవగాహన వర్క్‌షాప్‌నకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీఎం సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఆర్బీఐ కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్లు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారం, చుట్టుగుంట చెరువు అభివృద్ధికి చర్యలు



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూ నగర్: ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ, చుట్టుగుంట చెరువు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయటానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను కోరారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులతో కలిసి చుట్టుగుంట చెరువు దగ్గర నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు జరుగుతున్న విస్తరణ, అభివృద్ధి పనులు పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత చుట్టుగుంట చెరువు, వాకింగ్ ట్రాక్‌లో జరుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తీర్ణం మాస్టర్ ప్లాన్ మేరకే జరగాలన్నారు. విస్తరణ పూర్తయిన ప్రాంతాలలో తక్షణమే డ్రెయిన్‌లు, రోడ్డు, సెంట్రల్ డివైడర్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కోర్టు కేసుల వలన విస్తరణ నిలిచిన ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ల సహకారంతో మాట్లాడి, విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఏటీ అగ్రహారం విస్తరణ పనులు జరిగిన ప్రాంతంలో రోడ్డుల నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు చేసేలా ఇంజినీరింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. విస్తరణలో ప్రభావితమైన భవనాలకు నష్టపరిహారం, స్థలాలకు, టి.డి.ఆర్ బాండ్లు వేగంగా అందించుటకు చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎం ఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ కోటేశ్వర రావు, డి.సి.పి. సూరజ్ కుమార్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అడకా పద్మావతి, అచ్చాల వెంకట రెడ్డి పాల్గొన్నారు.

మొండి గేటు డ్రెయిన్‌ను సమగ్ర సర్వే జరిపించాలి

కమిషనర్ శ్రీనివాసులు



పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్ నగరం నుంచి వెళ్లే మొండి గేటు నుంచి జాతీయ రహదారి వరకు డ్రెయిన్‌ను సమగ్రంగా సర్వే చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పాత గుంటూరు మొండిగేటు, బాలాజీ నగర్, వెహికిల్ షెడ్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మొండిగేటు దగ్గర నుంచే నగరంలోని అధిక శాతం డ్రెయినేజీ అవుట్ సైడ్ కి వెళుతుందని, సదరు ప్రాంతంలో కొంత ఆక్రమణలకు గురి అయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాలాజీ నగర్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, మధ్యాహ్నం డ్రెయిన్‌లు శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం జీఎంసీ వెహికిల్ షెడ్‌ని పరిశీలించి, మరమ్మతులకు గురైన ఏ వాహనం అయినా 2 రోజులలో మరమ్మతులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పర్యటనలో ఈఈ సుందర రామిరెడ్డి, డీఈఈ సతీష్ పాల్గొన్నారు.